క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి పూజలు

పిచ్చాటూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని షిర్డి సాయిబాబా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పిచ్చాటూరు మండలం కీళపూడిలో, నాగలాపురంలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయాల్లో పాలాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందన్నారు.

రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్డు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీఎస్ పురం పంచాయతీ పరిధిలో ఉన్న అరిగిలకండ్రిగ గిరిజన కాలనీకి రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్డును వేశారు. ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న గిరిజన కాలనీకి సిమెంట్ రోడ్డు వేయించడంతో సర్పంచ్ సిద్ధమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మణినాయుడుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం తొట్టంబేడు తాలుకా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు హాజరై భక్తులకు అన్నదానం చేశారు. లారీ అసోసియేషన్ సభ్యులు సుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, జయశంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్‌లో జ్యోత్స్న ప్రతిభ



జ్యోత్స్నను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాళహస్తి: ఇటీవల ఢిల్లీలో జరిగిన లాన్ టెన్నిస్ అండర్–19 విభాగంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మామండూరు జ్యోత్స్న ప్రతిభ చూపింది. జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. దీంతో ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్‌లో అధ్యక్షుడు సిద్ధులగారి మురళి, కార్యదర్శి రూపేష్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివకుమార్, కృష్ణకుమార్, సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్, రామకృష్ణయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయాన్ని శుద్ధి చేసిన శివ భక్తులు



ఆలయం శుద్ధి చేస్తున్న శివభక్తులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం 100 మంది శివ భక్తులు శుద్ధి చేశారు. చెన్నైలోని అంబత్తురుకు చెందిన శ్రీ అరుల్మిగు తాండుండేశ్వర శివ సేవా సంఘానికి చెందిన సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకుని ఆలయ ప్రాంగణం, ప్రాకారం, ప్రదోష మండపం, గోశాల మాడ వీధులను నీటితో శుభ్రం చేశారు. వీరు ఏటా ఆలయాన్ని శుద్ధి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు.

ఆర్టీసీ దుకాణాలకు షోకాజ్ నోటీసులు

తిరుపతి అర్బన్: జిల్లాలో 20 ఆర్టీసీ దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు జరిమానా విధించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వస్తువులను విక్రయిస్తుండడంతో షోకాజ్ నోటీలు ఇచ్చినట్లు చెప్పారు. తిరుపతి బస్టాండ్‌లోని 9, పుత్తూరులో 2, సూళ్లూరుపేటలో 4, గూడూరులో 2, వెంకటగిరిలో 2, వాకాడ బస్టాండ్‌లో ఒక దుకాణానికి జరిమానా విధించినట్లు చెప్పారు. దుకాణదారులు తమకు కేటాయించిన వస్తువులనే విక్రయించాలని, అంతేకాకుండా తమ కేటాయించిన ప్రదేశంలోనే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని వెల్లడించారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

భారీగా తరలివచ్చిన భక్తులు





పూజలు చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, సాగర్‌బాబు



కంకణధారులైన భక్తులు

అగ్నిగుండ మహోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం అగ్నిగుండ మహోత్సవం కనుల పండువగా జరిగింది. సుమారు 4 వేల మంది భక్తులు కంకణాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి అగ్నిగుండం వద్దకు తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ మూడుమార్లు ప్రదక్షిణ అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చారు. 9 మూలల్లో గుమ్మడికాయలు కొట్టారు. నిప్పలను తీసుకుని మల్లెపూలలో పెట్టి అమ్మవారి ఒడిలో పోసి ప్రత్యేక హారతులు సమర్పించారు. అనువంశిక పూజారి ఆ మల్లెచెండును నిప్పుల్లో వేసి అగ్నిగుండప్రవేశం చేశారు. అనంతరం పోతురాజు, గెరిగ.. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు, డీఎస్పీ భీమారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. –శ్రీకాళహస్తి



పూలచెండును విసురుతున్న పూజారి



అగ్నిగుండంలో నడుస్తున్న పోతురాజు

బీఎన్‌కండ్రిగలో వంద శాతం పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆదివారం సాయంత్రానికి వంద శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఆలత్తూరు, కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, బీఎన్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ నగదు అందజేశారు.

జగనన్న సురక్షపై ఇంటింటి సర్వే



కంచనపుత్తూరు గ్రామంలో సర్వే చేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంపై ఆదివాకం కంచనపుత్తూరు గ్రామంలో వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. వివరాలను యాప్‌లో నమోదు చేశారు. మిగిలిపోయిన సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం గ్రామంలోని మహిళలు ఆలయం వద్ద పొంగళ్లుపెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పండరి భజన భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త పద్మనాభం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకృష్ణాశ్రమంలో వార్షికోత్సవ పూజలు



మాట్లాడుతున్న శివానందగిరి స్వామి

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి శ్రీకృష్ణాశ్రమంలో రెండో రోజు ఆదివారం వార్షికోత్సవ పూజలు జరిగాయి. స్వామివారి చిత్ర పటానికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆశ్రమాల పీఠాధిపతులు ఉపన్యాసాలు చేశారు. పుత్తూరు జగన్మాత ఆశ్రమ పీఠాధిపతి శివానందగిరి స్వామి, హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ ఆనందగిరి స్వామి, కేశవానందస్వామి, స్వరూపానంద స్వామి, ఆశ్రమ నిర్వాహకుడు రంగాచార్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. వెంకటగిరికి చెందిన సుమన్(36), ఈశ్వర్(39) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా అంజిమేడు వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఇందులో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

- అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబం
- తక్షణ సాయంగా బియ్యం, రూ.8 వేల చెక్కు పంపిణీ
- ఐఏవై పథకం కింద ఇల్లు మంజూరు చేస్తాం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



పీఎంసీ చైర్మన్ శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు: మండలంలోని తులసిక్రిష్టాపురం యానాదికాలనీలో శుక్రవారం సాయంత్రం మాతమ్మ, సురేష్ దంపతుల పూరికల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం గ్రామానికి చేరుకుని కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఇంట్లో ఉంచిన డ్వాక్రా రుణం డబ్బులు రూ.1.90 లక్షలు సగం కాలిపోయిన నోట్లను బాధితురాలు మాతమ్మ ఎమ్మెల్యేకు చూపిస్తూ బోరుమని విలపించింది. తాము నిరుపేదలమని, తన భర్త పెట్రోల్ బంకులో పని చేసి తనను, తన ఇద్దరు పిల్లలను పోషిస్తున్నారని చెప్పి కన్నీరుమున్నీరైంది. వీధిన పడ్డ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యేను వేడుకుంది. స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం, రూ.8 వేల చెక్కును అందించారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్నీ సదుపాయాలను వెంటనే అందించాలని, ఐఏవై పథకం కింది వెంటనే ఇల్లు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అన్నీ విధాలుగా ఆదుకుంటుందని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

పీఎంసీ చైర్మన్‌కు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తులసిక్రిష్టాపురం పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం సాయంత్రం పరామర్శించారు. 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో శంకర్ రెడ్డి గాయపడి శస్త్ర చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శంకర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ సభ్యులు రాగమ్మ, రమేష్ రాజు, వీఆర్‌ఓ ప్రియాంక, వైస్ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

లోకకల్యాణార్థం.. చతుర్వేద హవనం



ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు ఎస్.శ్రీవాణి బృందం ప్రదర్శించిన వీణావాద్య సంగీత కచ్చేరి శ్రవణానందకరంగా సాగింది.

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవన ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనం ఆదివారం నాలుగోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కుప్పా విశ్వనాథశర్మ మాట్లాడుతూ యజ్ఞయాగాదులను దర్శించడం ద్వారా సకల శుభాలను పొందవచ్చన్నారు. మంత్రపూర్వకంగా అగ్నిలో ఆహుతులను సమర్పిస్తే సిరిసంపదలు చేకూరుతాయని వెల్లడించారు. ఈ క్రమంలో వేదపండితులు ఉదయం చతుర్వేద హవనం, మధ్యాహ్నం చతుర్వేద పారాయణం నిర్వహించారు. సాంస్కృతిక వేదికపై ఎస్వీ సంగీత కళాశాల

ముగిసిన కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



తిరుపతి కల్చరల్ : కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామి వారి వీధి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తులకు పవిత్రమాల, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాముల హల్‌చల్



నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబర కుప్పం ప్రకాష్ నగర్ గుబురుగా ఉన్న చెట్ల సమీపంలో ఉన్న ఇంటి బాత్రూంలోకి మూడు పాములు చొరబడడంతో ఆ ఇంట్లో వారితో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పాములను అక్కడి నుంచి పంపేందుకు వారు ప్రయత్నించగా చెట్ల మధ్యలోకి వెళ్లి రెండు పాములు కలసి పెన వేసుకుని బుస కొట్టడంతో భయాందోళన చెందారు. ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించగా వారు పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌ను రప్పించారు. అప్పటికే పాములు బాత్రూంలో నుంచి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లాయి. వాటిని పట్టుకోవడానికి స్నేక్ క్యాచర్ తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. అయితే పాములు ఆ ప్రాంతంలోనే అక్కడే సంచరిస్తున్నాయని, తక్షణం పొదలను శుభ్రపరిస్తేనే వాటిని పట్టగలమని స్నేక్ క్యాచర్ మున్సిపల్ అధికారులకు సూచించారు.

బడుగుల ఇళ్లకు ఉచిత వెలుగులు

నాడు

టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీల గృహాలకు 50 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేవారు. 2019 ఎన్నికల సమయంలో ఆ ఉచితాన్ని 125 యూనిట్లకు పెంచారు. 125 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ అదనంగా వినియోగించినా ప్రతి యూనిట్‌కు బిల్లులు వసూళ్లు చేశారు. దీంతో ఎంతో మంది ఎస్సీ, ఎస్టీలు పెద్దగా లబ్ధి పొందలేకపోయారు.

నేడు

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిస్థితులను అర్థం చేసుకుని ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచింది. అందుకు అనుగుణంగా లబ్ధిదారుల సంఖ్య రెట్టింపు అయ్యింది. నేడు పేదల ఇళ్లకు ఉచిత విద్యుత్ వెలుగులు నిండాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- సత్యవేడు నియోజకవర్గంలో 20649 మందికి లబ్ధి
- నెలకు సబ్సిడీ రూ. 1.39కోట్లు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో 30 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. అందులో 20649 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఇందు కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 1.39 కోట్లు సబ్సిడీ ఖర్చు చేస్తోంది. అత్యధికంగా వరదయ్యపాళెం మండలంలో 4559 మంది లబ్ధిదారులు ఉన్నారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల కష్టాలను ప్రత్యక్షంగా చూసి అధికారంలోకి వచ్చిన 6 నెలలకే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని బడుగులకు సొంతం చేశారు. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు నెలనెలా బిల్లులు చెల్లించే ప్రక్రియ నుంచి విముక్తి లభించింది. దీంతో ఆ కుటుంబాల్లో ఉచిత వెలుగులు నిండాయి.



వరదయ్యపాళెంలోని వీకేఆర్‌వై గిరిజనకాలనీ

ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న ఉచిత విద్యుత్ వివరాలు

మండలం	సర్వీసులు	సబ్సిడీ మొత్తం
వరదయ్యపాళెం	4559	33.46లక్షలు
నాగలాపురం	2683	20లక్షలు
పిచ్చాటూరు	2509	17.35లక్షలు
సత్యవేడు	3079	24.93లక్షలు
చెరివి (శ్రీసిటీ	1690	12.82లక్షలు
బీఎన్‌కండ్రిగ	3400	16లక్షలు
నారాయణవనం	511	6.78లక్షలు
కేవీబీపురం	1218	7లక్షలు

ఉచితంతో మేలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా కల్పించారు. ఉచిత విద్యుత్‌తో ఎంతో మంది పేద ఎస్సీ, ఎస్టీలకు మేలు జరుగుతోంది. టీడీపీ హయాంలో కేవలం 125 యూనిట్ల విద్యుత్ ఇవ్వడంతో చాలా మందికి ఆ పథకం వర్తించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా కరెంటు బిల్లు పైసా కట్టలేదు.

–మునస్వామి, వీకేఆర్‌వై గిరిజనకాలనీ, వరదయ్యపాళెం మండలం

చాలా సంతోషం



ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. మా ఇంటికి ఈ పథకం వర్తించింది. నాలుగేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. చాలా సంతోషంగా ఉంది. ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జగన్ ప్రభుత్వానికి అండగా ఉంటాం.

బాలరాజు, రాచర్ల దళితవాడ, వరదయ్యపాళెం